క్లుప్తంగా

ఫీడర్ ఛానల్ పూడ్చివేతపై ఫిర్యాదు

సంగెం : మండలంలోని వెంకటాపూర్‌లో కరుణాపురం నుంచి ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఫీడర్ ఛానల్ పూడ్చివేతపై పంచాయతీ కార్యదర్శి అనూష పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 24న ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఫీడర్ ఛానల్‌ను గ్రామానికి చెందిన న్యాల శ్రీనివాస్, రాజు, అశోక్ ట్రాక్టర్ పెట్టి పూడ్చివేయగా అక్రమంగా పూడ్చి వేసిన ఫీడర్ ఛానల్‌ను పునరుద్ధరించేలా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదులో కోరారు. ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు మేరకు విచారణ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన ఇద్దరిపై కేసు

సంగెం : భూ వివాదంలో దూషించి ఆత్మహత్యకు ప్రేరేపించిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఎల్గూర్ స్టేషన్‌కు చెందిన గుగులోత్ వీరూ, తిరుపతి, వెంకటేశ్వర్లు అన్నదమ్ములు. వీరికి తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమి పంపకంలో తగాదాల నేపథ్యంలో తిరుపతి భార్య విజయ, కుమారుడు గోపీని ఈనెల 25న పెద్ద మనుషుల సమక్షంలో పిలిపించారు. ఈ క్రమంలో గోపీని వీరూ, వెంకటేశ్వర్లు అవమానించేలా దూషించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గోపీ ఇంట్లోకి వెళ్లి అందరి ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గోపీని కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. గోపీ తల్లి విజయ ఫిర్యాదు మేరకు వీరూ, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోడు భూములకు పట్టాలు ఇప్పించండి



సీపీఎం జిల్లా నాయకుడు సమ్మయ్య

నర్సంపేట : నర్సంపేట డివిజన్ పరిధిలో రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు సంబంధించి పట్టాలు ఇప్పించాలని సీపీఎం జిల్లా నాయకుడు భూక్య సమ్మయ్య కోరారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం సమ్మయ్య మాట్లాడారు. పోడు భూములను సాగు చేస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు గత ప్రభుత్వం పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి భూ కొలతలు చేపట్టిందని గుర్తు చేశారు. కొన్ని చోట్ల గిరిజనులకు పట్టాలిచ్చి బీసీ, ఎస్సీ, ఓసీ రైతులకు కొలతలు కొలిచి పట్టాలు ఇవ్వకపోగా కేసులు బనాయించిందని తెలిపారు. ఇప్పటికీ ఫారెస్టు శాఖ అధికారుల వేధింపులు, దాడులు కొనసాగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. అటవీ, రెవెన్యూ శాఖల నడుమ ఉన్న భూసమస్యలను పరిష్కరించి గత ప్రభుత్వం రెవెన్యూ భూముల్లో పట్టాలు రద్దు చేసిన వారికి పట్టాలిప్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొళ్ల సాంబయ్య, ముంజాల సాయిలు, యార ప్రశాంత్, నల్లబెల్లి మండల కార్యదర్శి కడియాల మనోహర్, నాయకులు అక్కపెల్లి సుధాకర్, పుచ్చకాయల భాస్కర్‌రెడ్డి, బొడిగె సమ్మయ్య, రాజు, పెండ్యాల సారయ్య, మాంకాల శ్రీనివాస్, సర్వర్, గోనె మల్లారెడ్డి, బసికె మొగిలి, ఇండ్ల కొమ్మాలు, ఇస్లావత్ రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన నమిండ్ల సుష్మ స్వరాజ్ ఎంబీబీఎస్ విద్యాభ్యాసానికి మండలంలోని మనుగొండకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి మంగళవారం రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదరికం నేపథ్యంలో సుష్మ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యాభ్యాసానికి సాయం అందించినట్టు తెలిపారు. తొలుత సుష్మను బాలకిశోర్‌రెడ్డి సన్మానించి అభినందించారు. కోర్సు పూర్తయ్యే వరకు తానే ఫీజు చెల్లిస్తానని భరోసా ఇచ్చాడు. కార్యక్రమంలో నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, డోలె చిన్ని, మంద రమేశ్, కూనూరు వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

దీక్షకు పలువురి మద్దతు

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలిలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట తండ్రి వాటా ఆస్తి కోసం మిట్టపెల్లి అరవింద్ చేపట్టిన దీక్ష మంగళవారం రెండో రోజు కొనసాగింది. దీక్షకు మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్ల సురేశ్, మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ అశోక్ మద్దతు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించాలని కోరారు.

చినుకు పడితే దారులన్నీ చిత్తడే



మట్టి రోడ్డుపై ఏర్పడిన గుంతలో నిలిచిన వర్షపు నీరు



బురదమయంగా మారిన ఓ వీధికి వెళ్లే దారి

- మట్టిరోడ్లపై నిలుస్తున్న వరద
- దోమలు, ఈగల స్వైర విహారం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆగ్రహిస్తున్న జనం

ఎల్కతుర్తి : మండలంలోని వివిధ గ్రామాల్లో గల దారులు చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారుతున్నాయి. దీంతో కాలినడక కూడా ఇబ్బందిగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతుందని వాపోతున్నారు. వరద నీలవడంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో రోగాల బారిన పడుతున్నామని అంటున్నారు. ఎల్కతుర్తి మండలంలో మొత్తం 19 గ్రామపంచాయతీలు ఉండగా ఇందులో సూరారం, దండేపల్లి, వీరనారాయణపూర్, కోతులనడుమ, జీల్గుల, జగన్నాథపూర్, పెంచికలపేట, గోపాల్‌పూర్, ఇంధిరానగర్, ఎల్కతుర్తి, చింతలపల్లి, దామెర, బావుపేట, ఆరేపల్లి, గుంటూర్‌పల్లి, తిమ్మాపూర్, కేశవాపూర్, రామకృష్ణాపూర్ గ్రామాలకు గాను మరో మూడు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటిలో మట్టి రోడ్లు ఉండగా వర్షం పడితే బురదమయంగా మారుతున్నాయని, అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. తక్షణమే స్పందించి సీసీ రోడ్లు నిర్మించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మండల కేంద్రంలోని 4వ వార్డులో రెండు వీధుల్లో వర్షపు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దుర్వాసన వెదజల్లుతోంది



ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచింది. వాహనాల రాకపోకలతో నీరంతా మురికిగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. కంపుతో భరించలేకపోతున్నాం. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేయించాలి.

- పోలు సుమతి, ఎల్కతుర్తి

సీసీ రోడ్లు నిర్మించాలి



గుంతలు పడిన రోడ్డును తొలగించి సీసీ రోడ్డు నిర్మించాలి. ఏళ్లు గడుస్తున్నా నాలుగో వార్డులోని రెండు దారులను పట్టించుకున్న నాథుడే లేడు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించాలి. వర్షం కురిస్తే నీరు నిల్వ ఉండి ఆరిగోస పడుతున్నాం

- మంద అరుణ, 4వ వార్డు, ఎల్కతుర్తి

ఉపాధి మేళాకు దరఖాస్తుల స్వీకరణ

అత్మకూరు : దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకంలో భాగంగా శ్రీటెక్నాలజీస్ సంస్థ మంగళవారం ఉచిత శిక్షణ ఉపాధి మేళాను మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించింది. 18 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వీరికి వరంగల్‌లో ఉచిత శిక్షణ, స్కాలర్‌షిప్ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని శ్రీటెక్నాలజీస్ ఇన్‌చార్జ్ రాజేందర్ తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేళాకు హాజరుకాని వారు నేరుగా వరంగల్‌లోని శ్రీటెక్నాలజీస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. యువతీ, యువకులకు శిక్షణ ఎంపికకు సంబంధించిన పత్రాలను అందచేశారు.



ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్

వ్యవసాయ ప్రణాళిక ప్రకటించడంలో నిర్లక్ష్యం



- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్

నర్సంపేట : ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న క్రమంలో ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళిక ప్రకటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ విమర్శించారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎన్‌రెడ్డి హంసారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశానికి రమేశ్ అతిథిగా హాజరై మాట్లాడారు. రైతు ప్రభుత్వంగా ఊదరగొడుతున్న కాంగ్రెస్ పార్టీ ఆచరణలో విరుద్ధంగా వ్యవహిస్తోందని విమర్శించారు. ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను ఇబ్బందుల పాల్జేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. తడిసిన ధాన్యాన్ని కొంటామని ప్రభుత్వం ప్రకటించినా కొనుగోలు చేసిన దాఖలాల్లేవని చెప్పారు. మిల్లర్లు, అధికారులు, కొనుగోలు కేంద్రాల బాధ్యులు కుమ్మక్కై రైతులను మోసగిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమైనా ప్రభుత్వ యంత్రాంగం భూసార పరీక్షలు కూడా చేయించడం లేదన్నారు. కమ్యూనిస్టు ఐక్యత, వ్యవస్థాపక అధ్యక్షుడు ఓంకార్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్న పార్టీ ప్రయత్నాలను ఎంసీపీఐ పేరుతో ప్రథమ మహాసభలంటూ ప్రజలను, కమ్యూనిస్టు శ్రేణులను గందరగోళ పరిచేలా ద్రోహులు యత్నిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోనె కుమారస్వామి, మంద రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు గుండెబోయిన చంద్రయ్య, నర్ర ప్రతాప్, గడ్డం నాగార్జున, మాసు సావిత్రి, మహ్మద్ రాజా, మాలి ప్రభాకర్, సంగం రాజన్న, ఎగ్గని మల్లికార్జున్, పెరబోయిన ఐలోని, పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

గుడి నిర్మాణానికి విరాళం



శాయంపేట : మండలంలోని సాధనపల్లి గ్రామంలో నిర్మించనున్న పెద్దమ్మతల్లి గుడికి మాజీ జెడ్పీటీసీ వంగాల రమాదేవి-నారాయణరెడ్డి దంపతులు మంగళవారం రూ. 50వేల విరాళాన్ని అందించారు. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో సాధనపల్లి గ్రామం, శాయంపేట మండల ప్రజలు సఖసంతోషాలతో, పాడిపంటలతో ఉండాలని కోరారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తిరుపతి, శ్రీను, సదానందం, శ్రీను, సాంబయ్య, షేక్ గౌస్ పాల్గొన్నారు.

పరామర్శ

పరకాల : అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన ఫర్టిలైజర్ వ్యాపారి మనోహర్‌ను బీఆర్ఎస్ నాయకుడు నాగూర్ల వెంకటేశ్వర్లుతో పాటు పరకాల ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

'చలో వరంగల్'కు తరలిరావాలి



ధర్మసాగర్ / వేలేరు : పద్మశ్రీ అవార్డు పొంది ఢిల్లీ నుంచి వరంగల్‌కు వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలికేందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రజలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ రుద్రపోగు సురేశ్ పిలుపునిచ్చారు. ధర్మసాగర్, వేలురు మండల కేంద్రాల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతిసాగర్ అధ్యక్షతన మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మంద కృష్ణమాదిగ భారత అత్యున్నత పౌర పురస్కారమైన పద్మశ్రీ పురస్కారాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకుని ఈనెల 31వ తేదీన వరంగల్ నగరానికి వస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల శ్రేణులు ఉదయం 10 గంటలకు వరంగల్ రైల్వే స్టేషన్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. అదే రోజు కాళోజీ కళాక్షేత్రంలో జాతీయ కార్యవర్గ సదస్సు ఉంటుందని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



తిరుపతి (ఫైల్)

వేలేరు : ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన యువకుడు పురుగలమందు తాగి ఆత్మహత్యకు పాలుపడ్డాడు. ఈ సంఘటన శాలపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వేలేరు ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని శాలపల్లి గ్రామానికి చెందిన గడ్డం తిరుపతి (33) హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తీసుకున్న అప్పులు ఎలా తీర్చలనే మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించగా వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తిరుపతి మృతిచెందాడు. మృతుడి సోదరి రత్నమాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా తిరుపతి గత రెండు సంవత్సరాల క్రితం ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి అయిన కొన్ని రోజులకే అమ్మాయి తల్లిదండ్రులు వచ్చి నచ్చచెప్పి అమ్మాయిని వారివెంట తీసుకువెళ్లారు. తిరుపతి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారం కారణమని స్థానికులు చర్చించుకుంటున్నారు.

మెపా బాధ్యుల ఓదార్పు

దుగ్గొండి : మండలంలోని రేకంపల్లికి చెందిన యాట రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ముదిరాజ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) బాధ్యులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మనోధైర్యం చెప్పారు.

అలరించిన చిందు యక్షగాన ప్రదర్శన



వర్ధన్నపేట : పట్టణంలోని మూడో వార్డులో గజవెల్లి వెంకన్న బృందం మంగళవారం నిర్వహించిన చిందు యక్షగాన ప్రదర్శన అలరించింది. కళాకారులు శశిరేఖ పరిణయం నాటిక ప్రదర్శించిన ఆహూతులను ఆకర్షించారు. నాటికలోని పాత్రదారుల హావభావాలు, సన్నివేశాలు, యక్షగానం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పదర్శనను తిలకించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన కంచ శిరీశకు మంజూరైన రూ.58 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆమెకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో శిరీశకు చెక్కు మంజూరైందని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, సొసైటీ మాజీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, నాయకులు ఉప్పరి వీరస్వామి, ఉప్పరి రామచంద్రు, మొర్రి వీరస్వామి, కన్నం వెంకన్న, మండల రవి, ఉప్పరి కొమురయ్య, కన్నం కుమార్, కుండె కుమారస్వామి, భానోతు పంతులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న వెంకట్‌రెడ్డి, నాయకులు

జాతీయ సమావేశాన్ని జయప్రదం చేయాలి



వర్ధన్నపేట : ఈనెల 31న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఎంఆర్‌పీఎస్ జాతీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు సొట్ట నరేందర్ బాబు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు స్వీకరించిన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ సమావేశానికి రానున్న క్రమంలో ఆయనకు వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఘన స్వాగతం పలుకుతామని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాదిగ ప్రజలు సమావేశానికి హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు మహేందర్, రామారపు శ్రీను, జన్ను రాములు, అంజయ్య, రాజు, గోపాల్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టులా..

- మాజీ సర్పంచ్‌ల ఆవేదన



పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

ఆత్మకూరు : గ్రామాభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేస్తే ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని, పెండింగ్ బిల్లులు అడిగితే అక్రమంగా అరెస్టులు చేయిస్తారా అని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌లు ప్రజాభవన్ ముట్టడికి పిలుపునివ్వగా మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. నీరుకుళ్ల మాజీ సర్పంచ్ అర్షం బలరామ్ , పెద్దాపూర్ మాజీ సర్పంచ్ కమల భర్త సావురే రాజేశ్వర్‌రావు, లింగమడుగుపల్లి మాజీ సర్పంచ్ రాజేశ్వరి భర్త రాజును అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అప్పు చేసి పనులు చేస్తే ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా బిల్లులు అన్ని పెండింగ్‌లో ఉంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాత్రం ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటుందన్నారు. అక్రమ అరెస్టులతో తమను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. బిల్లులు చెల్లించే వరకు ఉద్యమిస్తామన్నారు.

వనమహోత్సవానికి సిద్ధంగా ఉంచాలి

- జెడ్పీ సీఈఓ విద్యాలత



నర్సరీని పరిశీలించిన జెడ్పీ సీఈఓ విద్యాలత

ఎల్కతుర్తి : వనమహోత్సవంలో నాటేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచాలని జెడ్పీ సీఈఓ విద్యాలత అన్నారు. భీమదేవరపల్లి మండలంలోని ములకనూరు, భీమదేవరపల్లి గ్రామాల్లో గల నర్సరీలను మంగళవారం ఆమె పరిశీలించారు. గ్రామాల్లో డ్రైనేజీల పరిశుభ్రత కోసం కమ్యూనిటీ సోక్‌పిక్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కమ్యూనిటీ టాయిలేట్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని వనసేవకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరేశం, ఏపీఓ కుమారస్వామి, కార్యదర్శులు పూర్ణచందర్, రాజ్‌కుమార్, టీఏలు రవి, లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు కృష్ణ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఏఓ కవిత



మాట్లాడుతున్న ఏఓ కవిత

వేలేరు : లైసెన్స్ లేకుండా విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కవిత హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లతో వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. కాలం చెల్లిన విత్తనాలు అమ్మిన్నట్లు తెలితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. షాపులో డీలర్ పేరు, ఇంటి నంబర్, ఇతర వివరాలను గోడలపై రాయించాలని అన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు రసీదులను తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఎస్సై సురేశ్, ఏఈఓలు రాజశేఖర్, విజయ్‌కుమార్, డీలర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సిబ్బందిని నియమించాలి

- బీజేపీ నాయకుడు విజయ్‌చందర్‌రెడ్డి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

హనుమకొండ (దామెర) : దామెర పీహెచ్‌సీలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి వైద్య సిబ్బందిని నియమించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలో జిల్లా వైద్యాధికారి అప్పయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత ఉండడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిబ్బంది నియమాకానికి కృషి చేస్తానని డీఎంహెచ్ఓ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరామ్‌రెడ్డి, బత్తుల సుమంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత



అరెస్ట్ చూపుతున్న ఎస్సై

ఎల్కతుర్తి : పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న భీమదేవరపల్లి మండలం ముస్తాఫాపూర్ గ్రామంలో ఎలగందుల కృష్ణమూర్తి కిరాణం షాపులో రూ.12,500 విలువచేసే పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయిబాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తులను అమ్మినా లేదా సరఫరా చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సూచించారు. ఏఎస్సై సంపత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

టీజేఎఫ్ రజతోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పరకాల : తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఈనెల 31వ తేదీన నిర్వహించనున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(హెచ్ 143) జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, కార్యదర్శి అర్షం రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని అమరధామంలో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను యూనియన్ నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. సభకు జర్నలిస్టులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు తుమ్మ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పెరుమండ్ల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు బొమ్మగాని ఆదర్శ్, దొమ్మాటి శ్రీకాంత్, పరకాల డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక



శాయంపేట : కాంగ్రెస్ పార్టీ తహరాపూర్ గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు గ్రామ ఇన్‌చార్జ్ వైనాల కుమారస్వామి తెలిపారు. అధ్యక్షుడిగా పైడి, ఉపాధ్యక్షులుగా సునీల్, సంపత్, ప్రధాన కార్యదర్శిగా దిలీప్, కార్యదర్శులుగా అమరేందర్ రెడ్డి, మహేందర్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా అశోక్, కోశాధికారిగా జగపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు పాల్గొన్నారు.